

పురుషుల సమగ్ర వెల్‌నెస్ ప్రోగ్రాం పోస్టరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి, డాక్టర్ సూరజ్ పిన్ని

నగర పురుషుల్లో పెరుగుతున్న వంధ్యత్వం

- ఒత్తిడితో కూడిన జీవనం, నిద్రలేమి కారణం: ఏఐఎన్‌యూ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడి, నిద్రలేమి కారణంగా పురుషులు వంధ్యత్వ సమస్యలు పెరుగుతున్నాయని బంజారాహిల్స్ ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ పూర్ణచద్రారెడ్డి అన్నారు. నగరంలోని పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతోందని, ప్రతీ ఇద్దరు మహిళలు, పురుషుల్లో లైంగిక, జనన సంబంధిత సమస్యలు పెరుగుతు న్నాయని అన్నారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషుల సమగ్ర వెల్‌నెస్ ప్రోగ్రాం పోస్టరును కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సూరజ్ పిన్నితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ పురుషుల్లో పెరుగుతున్న వంధ్యత్వం (సంతాన రాహిత్యం), లైంగిక పటుత్వం లోపించడం లాంటి సమస్యలపై ప్రధానంగా దృష్టిసారించామన్నారు. పురుషుల కోసం రూపొందించిన ప్రత్యేక ప్యాకేజిలో ఆండ్రాలజిస్టు పరీక్షలతో పాటు హార్మోన్ ప్రొఫైలింగ్, ప్రోస్టేట్ స్క్రీనింగ్, జీవన శైలి అంచనా, వీర్యపరీక్షలు ఉంటాయని తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ నుంచి అధ్యక్షుడి బహిష్కరణ

- మరికొందరిపైనా వేటు
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభల నిర్వహణ కార్యక్రమాల కోసం అడహక్ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి టీడబ్ల్యూజేఎఫ్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితూడి బాపూరావును శాశ్వతంగా బహిష్కరించాలని తీర్మానించింది. వీరి ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 'వీరంతా కొంతకాలంగా సంఘం నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో టీబ్ల్యూజేఎఫ్‌కు భంగం కలిగిస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. సంఘం సభ్యత్వ రుసుంను దుర్వినియోగం చేశారు. ఇక నుంచి వీరికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)తో ఎలాంటి సంబంధం లేదు. వీరు నిర్వహించే సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు టీడబ్ల్యూజేఎఫ్‌కు సంబంధం లేదన్న విషయాన్ని జర్నలిస్టు మిత్రులు, సంఘం శ్రేయోభిలాషులు గుర్తించాలని' టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య పేర్కొన్నారు.

వీసా గడువు ముగిసినా అక్రమంగా తిష్ట

- నైజీరియన్ స్మగ్లర్ ఆటకట్టించిన హెచ్ న్యూ టీమ్
- దేశం నుంచి బహిష్కరించి డిపోర్టేషన్ చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసిన నగరంలో అక్రమంగా ఉంటూ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న నైజీరియన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నైజీరియాకు చెందిన ఓన్యూక్వూ కిలేచీ విక్టర్.. స్టూడెంట్ వీసాపై 2021 లో ఇండియాకు వచ్చి బెంగళూరులోని నోబుల్ కాలేజీలో బీసీఏలో చేరాడు. కొద్దిరోజులకే చదువు మానేసిన ఓన్యూక్వూ కిలేచీ విక్టర్.. బెంగళూరులోని నైజీరియన్స్‌తో కలిసి కమీషన్ తీసుకుని బెంగళూరు, హైదరాబాద్‌లోని పెడ్లర్స్‌కు డ్రగ్స్ సరఫరా చేసేవాడు. డ్రగ్స్ స్మగ్లర్స్‌పై నిఘా పెట్టిన హెచ్‌న్యూ పోలీసులు.. బంజారాహిల్స్‌లో ఓ డ్రగ్స్ పెడ్లర్‌తో కలిసి ఓన్యూక్వూ కిలేచీ విక్టర్ తిరుగుతున్నట్లు సమాచారం అందింది. రంగంలోకి దిగిన హెచ్ న్యూ పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. పెడ్లర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. నైజీరియన్ వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడం, 2024 ఏప్రిల్‌లోనే వీసా గడువు ముగిసిపోయినట్లు గుర్తించారు. అతని పాస్‌పోర్టు మాత్రమే 2028 వరకు చెల్లుబాటు అయ్యేలా ఉంది. దీంతో ఓన్యూక్వూ కిలేచీ విక్టర్‌ను దేశం నుంచి బహిష్కరించి డిపోర్టేషన్ చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనార్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఏయిర్ పోర్టులో విమానం ఎక్కించి వారి దేశానికి డిపోర్టేషన్ చేసినట్లు డీసీపీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 11 మంది నైజీరియా స్మగ్లర్స్‌ను హెచ్ న్యూ పోలీసులు డిపోర్టేషన్ చేశారని, 2022 నుంచి ఇప్పటి వరకు 33 మంది విదేశీ స్మగ్లర్స్‌ను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారని డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.

విద్యార్థినిపై లైంగిక దాడి

- నిందితుడికి 25 ఏళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో జూనియర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డ సీనియర్ విద్యార్థికి న్యాయస్థానం 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే... సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన ఆశం శ్రీరాములు(18) నగరంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుతున్న జూనియర్ విద్యార్థిని(16)పై కన్నేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకొని ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. బాలిక నగ్న ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. వాటిని చూపించి డబ్బు ఇవ్వాలని వేధించాడు. ఈ క్రమంలో బాలికపై శ్రీరాములు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కాలేజీ వెళ్లకుండా ఇంట్లో ఉండడంతో తల్లిదండ్రులు మందలించగా జరిగిన విషయం చెప్పింది. దాంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా లాలాగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టి పోలీసులు పక్కాగా ఆధారాలు సేకరించి నిందితుడుని నాంపల్లి 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు శ్రీరాములుకు 25 జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు.



తెలుగు చిత్రకళా రంగంలో తమదైన ప్రత్యేకతకు చాటుకున్న ఆరుగురు ఆర్టిస్టులు గీసిన 'బ్లాక్ అండ్ వైట్' రేఖాచిత్రాల మాలికలు కళాభిమానులను అలరిస్తున్నాయి. రకరకాల థీమ్స్‌తో తెల్ల కాగితంపై నల్ల గీతలతో ఆకృతి దాల్చిన 90కుపైగా రేఖాచిత్రాలు అదుర్స్ అనిపించాయి. శంకర్ పామర్తి, తల్లావజల శివాజీ. మాకినీడి శ్రీనివాసరామ్, రాజేష్ నాగులకొండ తదితరులు వేసిన ఈ చిత్రాలు బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని ఐకాన్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 16 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందనినిర్వాహకులు చెప్పారు.

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కూల్చివేత



కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నిస్తున్న వారిని నిలువరిస్తున్న సీఐ సైదిరెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది



తహసీల్దార్ వేణుగోపాల్‌తో ఆక్రమణదారుల వాగ్వివాదం

ఎల్బీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను బుధవారం రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ కల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆక్రమణదారులు విఫల యత్నం చేయగా సరూర్‌నగర్ పోలీసులు నిలువరించారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరూర్‌నగర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 9/1లోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో ప్రభుత్వానికి, ఇతరులకు నడుమ దశాబ్దాలుగా వివాదం కోర్టులో నడుస్తోంది. 2015లో కోర్టు సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని



ఆక్రమణలను జేసీబీతో కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కాగా 2021లో రెవెన్యూ అధికారులు ఈ స్థలానికి ఫెన్సింగ్ వేశారు. ఆక్రమణదారులు ఫెన్సింగ్‌ను కూడా తొలగించారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్టోబర్ 29న రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసు ఇచ్చారు. నోటీసుకు వారు స్పందించకపోవడంతో బుధవారం ఉదయం సరూర్‌నగర్ రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చి 5 ఇళ్లను ఖాళీ చేయించి కూల్చివేశారు. తహసీల్దార్ వేణుగోపాల్ పర్యవేక్షణలో నాయబ్ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐలు సహదేవ్‌రెడ్డి, గీత తమ సిబ్బందితో ఆక్రమణలను కూల్చివేయించారు.

పరిసరాల శుభ్రత బాధ్యత పారిశుధ్య కార్మికులదే

- కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత బాధ్యత పారిశుధ్య కార్మికులదేనని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ వార్డు కార్యాలయంలో డివిజన్ శానిటేషన్ సిబ్బంది, రాంకీ ఉద్యోగులతో కలిసి బుధవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు. రాంకీ సిబ్బంది కూడా చెత్తను సరైన సమయంలో ఎత్తకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని సిబ్బందిపై కఠినంగా వ్యవహరించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈఈ నీలిమ, ఎస్ఎస్ చంద్రశేఖర్, జవాన్ రామచందర్, సూపర్‌వైజర్లు మధు, నగేష్, రాజ్‌కుమార్, మల్లేష్, శ్రావణ్, రాంకీ సూపర్‌వైజర్లు రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ హైకోర్టుకాలనీలో నెలకొన్న వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు స్థానిక



మాట్లాడుతున్న హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాలనీలో నిర్మించతలపెట్టిన వరదనీటి పైప్‌లైన్ పనుల స్థాయి, మార్గాలను సంబంధిత అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరతగతిన వరదనీటి పైప్‌లైన్ పనులను నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, హైకోర్టు కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, సుభద్రకాలనీ అధ్యక్షుడు లక్ష్మణస్వామి, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శి గోవిందాచారి, నాయకులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన శ్రీనివాస్



హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కోట్ల శ్రీనివాస్ తన ఏడాది పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదే విధంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావులను కూడా కలిశారు.

- సైదాబాద్, (ఆంధ్రజ్యోతి)

పెద్దఅంబర్‌పేటలో హైడ్రా అధికారుల పర్యటన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ 4వ వార్డు సొటకుంటలో నిర్మాణాలను హైడ్రా అధికారులు పరిశీలించారు. సొటకుంటలో కన్వెన్షన్ నిర్మాణం, ప్రభుత్వ భూమిలో గోదాంలను నిర్మించారని పెద్దఅంబర్‌పేట్ మాజీ కౌన్సిలర్ గంట అనుపమాలక్ష్మారెడ్డి సెప్టెంబర్ 23న హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం హైడ్రా ఎస్ఐ ముజాఫర్ సొటకుంటతో పాటు ప్రభుత్వ భూమిలో నిర్మించిన గోదాంలను పరిశీలించారు. వాటికి సంబంధించి ఫిర్యాదుదారు వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. నిర్మాణ అనుమతులు, ప్రభుత్వ, ప్రైవేటు భూ రెవెన్యూ రికార్డులు, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించిన రికార్డుల వివరాలను ఆయా శాఖల ద్వారా కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా శాఖలు ఇచ్చిన నివేదిక ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని ఎస్ఐ ముజాఫర్ తెలిపారు.

నాణ్యతగా సీసీ రోడ్ల నిర్మాణం: కార్పొరేటర్

చాదర్‌ఘాట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్లను నిర్మించాలని కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి అధికారులకు సూచించారు. ముసారాంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రూ.14లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ జీహెచ్ఎంసీ ఏఈ శరత్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దినేష్‌పటేల్, మాజీ అధ్యక్షుడు యాదగిరి, సురేందర్, కాలనీవాసులు కొండారెడ్డి, పర్శరాంనాయక్, సురేష్, ఉమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి



డీఎస్‌ఆర్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించి భవన నిర్మాణ అనుమతులిచ్చి సహకరించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ ఉప్పల్ తహసీల్దార్ పవాల్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

- మన్సూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి)

సీఐటీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఎల్బీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాటేదన్‌లో జరిగిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడిగా మల్లెపాక వీరయ్య, సహాయ కార్యదర్శిగా ఆలేటి ఎల్లయ్యలు ఎన్నికయ్యారు. తమను గుర్తించి ఉన్నత పదవుల్లో అవకాశం కల్పించిన నాయకులకు వీరయ్య, ఎల్లయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చాదర్‌ఘాట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని మలక్‌పేట ఎస్ఐ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన యాంటీ ర్యాగింగ్ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, లక్ష్యసాధన కోసం కష్టపడాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లుగా గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సంజీవరెడ్డి విద్యార్థులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ట్రాఫిక్ కంట్రోలింగ్ సిబ్బంది

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యను తొలగించేందుకు నూతనంగా ట్రాఫిక్ కంట్రోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో మార్కెట్‌కు పంట తెచ్చే రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ కంట్రోలింగ్ సిబ్బందిని నియమించినట్లు చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డిలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కవాడిపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శ్రీవాణితో కలిసి ఆయన పరిశీలించారు. గ్రామానికి మంజూరైన ఇళ్ల వివరాలలు, నిబంధనల ప్రకారం బిల్లులు వస్తున్నాయా అని అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూధనచారి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రాముయాదవ్ పాల్గొన్నారు.

పనిచేస్తున్న ఇంటికే కన్నం.. భార్యాభర్తల అరెస్ట్

- రూ.4లక్షల నగదు, 10తులాల బంగారు నగలు స్వాధీనం

చాదర్‌ఘాట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను తీర్చుకోడానికి పనిచేస్తున్న ఇంటికే కన్నం వేశారు. నగదు, విలువైన నగలు కాజేశారు. తెలివిగా పనిమానేస్తున్నామని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత గుర్తించిన కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు సాంకేతికత ఆధారాలతో గుర్తించి దొంగతనానికి పాల్పడిన భార్యాభర్తలిద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4లక్షల నగదు, 10తులాల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా బాల్యానాయక్ తండాకు చెందిన భార్యాభర్తలు లవురి రవిరామ్, పద్మలు స్నేహపురి కాలనీలో నివాసముంటున్నారు. రవిరామ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా పద్మ పనిమనిషిగా చేస్తుంది. వీరిద్దరు మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్‌కు నాగేంద్రరావు ఇంట్లో 2023 నుంచి పని చేస్తున్నారు. గత నెల అక్టోబరు 25న పని మానేస్తున్నామని పద్మ, రవిరామ్‌లు తెలిపారు. మరో పనిమనిషి కుదిరే వరకు నెలాఖరు వరకు పనిచేయాలని వృద్ధ దంపతులు కోరారు. పద్మ, రవిరామ్‌లు పని మానేసిన తర్వాత వీరికి అల్మారాలో ఉన్న నగదు, నగలు కనిపించలేదు. ఈ విషయాన్ని వృద్ధ దంపతులు తన కుమారుడైన గోపీచంద్‌కు తెలిపారు. ఈ నెల



రికవరీ చేసిన నగలు, నగదును చూపిస్తున్న మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి

4న మలక్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మలక్‌పేట సీఐ నరేష్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మలక్‌పేట క్రైం ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఎస్ఐ కిరణ్‌లాల్‌తో కూడిన బృందం పద్మ, రవిరామ్‌లను బీఎన్‌రెడ్డినగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల నగదు, 10 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ సుబ్బిరామిరెడ్డి తెలిపారు. దొంగతనం కేసు ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన మలక్‌పేట క్రైం ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఎస్ఐ కిరణ్‌లాల్‌తో కూడిన బృందాన్ని ఏసీపీ ప్రశంసించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంపాపేట 11కేవీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీ, శిఖరా ఎన్‌క్లేవ్, నాగర్జున కాలనీ, ఆర్టీసీ కాలనీ, భానునగర్, కేశవనగర్, సింగరేణికాలనీ, రాఘవేంద్రకాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

రేషన్ డీలర్ల బకాయిలు విడుదల చేయాలి

హయత్‌నగర్: రేషన్ డీలర్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించక పోవడంతో డీలర్లు గోధుమలను ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారన్నారు. కేరళ మాదిరిగా 14 రకాల నిత్యావసర సరుకులను పేదలకు అందజేయాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, మూర్తి, భిక్షపతి, నరసింహ పాల్గొన్నారు.

జడ్సీకి వినతిపత్రం



ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి వాంబేకాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మండలం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, నేతలు శంకర్‌నాయక్, రవి, రాజు, వాజిద్, గిరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

- సైదాబాద్, (ఆంధ్రజ్యోతి)

జర్నలిస్టుకు సన్మానం



భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శారద కళానికేతన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో సత్యహరిశ్చంద్ర పద్యనాటకంలోని కాటిదృశ్యంలో సతీష్‌పాల్ ప్రదర్శించిన నటన, పద్యాలాపన అదేవిధంగా కురుక్షేత్రం నాటకంలోని దుర్యోధన సమాలోచన దృశ్యంలో మామిడి సంజీవరావు ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రఖ్యాత హాస్య అవధాని ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణను ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం సత్కరించి రేలంగి పురస్కారం, చతుర చలోక్తి చక్రవర్తి బిరుదును బహూకరించి సత్కరించారు.

- చిక్కడపల్లి, (ఆంధ్రజ్యోతి)

డిసెంబరు 26న సీపీఐ బహిరంగ సభ



బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కొత్తపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 26న ఖమ్మంలో సీపీఐ మహాసభల ముగింపు బహిరంగ సభకు పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రజా సంఘాల సబ్‌కమిటీ సభ్యుడు కృష్ణ కోరారు. బుధవారం న్యూ నాగోల్ ఎస్‌యే డాంగే భవన్‌లో బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, గోపాల్, సైదారావు, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలులో ఉద్రిక్తత

- రౌడీషీటర్ల మధ్య ఘర్షణ
- ఇరువురికి గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స

సైదాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రౌడీషీటర్ల మధ్య దాడి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో ఒకరు గాయపడగా, మరొకరు భయంతో చేతిని కోసుకున్నాడు. దీంతో జైలు అధికారులు ఒకరిని ఉస్మానియా ఆసుపత్రికి, మరొకరిని గాంధీకి తరలించి చికిత్స అందించారు. టప్పాచబూత్ర పోలీస్‌స్టేషన్‌లో మరణాయుధాల కేసులో రౌడీషీటర్ దస్తగిరిని సుమారు రెండు నెలల క్రితం పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అత్తాపూర్‌కు చెందిన మరో రౌడీషీటర్ జాబ్రీ మర్డర్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో రెండు రోజుల క్రితం జైలుకు వచ్చాడు. రౌడీషీటర్లు దస్తగిరి, జాబ్రీలకు పాతకక్షలు ఉన్నాయి. బుధవారం జైలులో ఆస్పత్రి వద్ద జాబ్రీని చూడగానే రెచ్చిపోయి దస్తగిరి దాడికి పాల్పడ్డాడు. జాబ్రీని కిందపడవేసి చేతిని గట్టిగా మలవడంతో గాయాలయ్యాయి. వెంటనే జైలు సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడ్డ దస్తగిరి భయంతో అక్కడే ఉన్న ఆస్పత్రి ట్యాబ్లెట్ స్ట్రిప్‌తో చేతికి గాయాలు చేసుకున్నాడు. జాబ్రీని ఉస్మానియా ఆస్పత్రికి, దస్తగిరిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి తిరిగి జైలుకు పంపించారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని జైలు అధికారులు తెలిపారు.

చావనిలో అగ్నిప్రమాదం.. రెండు దుకాణాలు దగ్ధం



దుకాణంలో దగ్ధమైన సామగ్రి

సైదాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు దుకాణాలు దగ్ధమైన సంఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. యాకత్‌పురా చావుని రోడ్డులో జూలీబ్యాంగిల్ స్టోర్, జూలీ ఫొటో స్టూడియోలను సోదరులు అక్బర్, యూనస్‌లు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. కొద్ది సేపటికే జూలీ బ్యాంగిల్ స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ఫొటో స్టూడియోకు మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. స్పందించిన అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా సుమారు రూ.15 లక్షల మేర నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ సందర్శించి బాధితులను పరామర్శించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోదండాపూర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో విద్యుత్ అంతరాయం కారణంగా, కృష్ణా ఫేజ్-2లో 2,375 మిమీ డయా గల పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌కు భారీ లీకేజీ ఏర్పడింది. లీకేజీని అరికట్టేందుకు జలమండలి అధికారులు అత్యవసరంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ మరమ్మతు పనుల కారణంగా నగరానికి వచ్చే నీటి సరఫరాపై ప్రభావం పడుతోంది. దీనివల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి అధికారులు తెలిపారు. వనస్థలిపురం, ఆటోనగర్, వైశాలినగర్, నాగోల్, బడంగ్‌పేట్, లెనిన్‌నగర్, ఏఆర్‌సీఐ, బర్కాస్, మైసారం, తార్నాక, బౌద్ధనగర్, లాలాపేట, మారేడ్‌పల్లి, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, మేకలమండి, మహేంద్రహిల్స్, ఎంఈఎస్ రైల్వేలు, కంటోన్మెంట్, హస్మత్‌పేట్, బాలానగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉండేవారు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని వారు సూచించారు.